## నేడు ఆన్‌లైన్ సదరం క్యాంపు స్లాట్‌లు విడుదల

### రంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత

షాబాద్, ఫిబ్రవరి 28: జిల్లాలో నేడు మీ సేవ సదరం క్యాంపు ఆన్‌లైన్ స్లాట్‌లు విడుదల చేయనున్నట్లు రంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డీఆర్‌డీఏ ఆమోదించిన మొదటి త్రైమాసిక షెడ్యూల్ ప్రకారం మార్చి నెలకు సంబంధించిన సదరం క్యాంపులు నిర్వహించేందుకు ఈ నెల 29న ఉదయం 11 గంటలకు మీసేవలో దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకునేందుకు ఆన్‌లైన్ స్లాట్స్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. సదరం క్యాంపునకు హాజరు కావాలనుకునే రంగారెడ్డి జిల్లాకు చెందిన దరఖాస్తు దారులు మీ సేవ ద్వారా గురువారం స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. సదరం క్యాంపులను జిల్లాలోని ప్రతి మంగళవారం కొండపూర్ జిల్లా దవాఖాన, ప్రతి శుక్రవారం వనస్థలిపురం ఏరియా దవాఖానలో నిర్వహించనున్నట్లు చెప్పారు. సదరం క్యాంపునకు వచ్చే దివ్యాంగులకు తప్పనిసరిగా మీ సేవలో స్లాట్ బుక్ చేసుకుని రశీదులో సూచించిన సమయానికి ఆ దవాఖానకు రావాలన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులు వారి పూర్వపు రిపోర్టును, మానసిక దివ్యాంగులు బోయిన్‌పల్లి ఎన్‌ఐఎంహెచ్, ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం నుంచి ఎల్‌క్యూ రిపోర్ట్‌ను తీసుకు రావాలని ఆమె సూచించారు.

### భాస్కర్ మెడికల్ కాలేజీకి నోడల్ సెంటర్‌గా గుర్తింపు..

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28: నేషనల్ మెడికల్ కమిషన్ భాస్కర్ మెడికల్ కాలేజీని మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీస్ నోడల్ సెంటర్‌గా గుర్తించారు. దీంతో తెలంగాణలో ఈ ఘనతను సాధించిన ఏకైక మెడికల్ కళాశాలగా గుర్తింపు లభించింది. ఈ నోడల్ సెంటర్‌ను నేషనల్ మెడికల్ కమిషన్ యూజీఎంఈబీ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ వి.వణికర్, నేషనల్ మెడికల్ కమిషన్ సభ్యుడు సభ్యుడు డాక్టర్ విజయేంద్రకుమార్‌లు బుధవారం ప్రారంభించారు. నోడల్ సెంటర్ మెంటార్ డాక్టర్ అవినాష్ సూపే, జేబీ విద్యా సంస్థల ప్రమోటర్, జోగినపల్లి బీఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యురాలు డాక్టర్ బి.దీపిక, భాస్కర్ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ పి.విచలం, నోడల్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ బి.శృతి, వివిధ రాష్ట్రాల నుంచి 24 వైద్య కళాశాలల ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

### పరీక్షల్లో కాపీయింగ్ జరిగితే

# చర్యలు తప్పవు

**■ కలెక్టర్ నారాయణరెడ్డి ■ ఇంటర్ పరీక్షా కేంద్రాల సందర్శన**

వికారాబాద్, ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ పరీక్షల్లో కాపీయింగ్ జరిగితే ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెంట్‌లపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఇంటర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పట్టణ కేంద్రంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను కలెక్టర్ అడుగగా... ఈ కేంద్రంలో 593 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 28 మంది గైర్హాజరయ్యారని అధికారులు వివరించారు. ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని, విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడకుండా ఇన్విజిలేటర్లు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. కాపీయింగ్‌కు పాల్పడినా.. సిబ్బంది సహకరించినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు స్థానిక తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

**నాణ్యతతో పూర్తిచేయాలి**

వికారాబాద్ జిల్లాలో సీసీ రోడ్లకు సంబంధించి నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి డీఈ, ఏఈలకు ఆదేశించారు. బుధవారం అధికారులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తూ మార్చి 15లోపు పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంజూరైన నిధులతో అంచనాలను రూపొందించుకుంటూ మార్చి 15 వరకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మండలాలవారీగా సీసీ రోడ్ల నిర్మాణ పనుల పురోగతికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా ఎఫ్‌టీవో జనరేట్ చేస్తూ లేబర్ సమావేశాలు నిర్వహించి లేబర్‌ను మొబిలైజ్ చేయాలని, గ్రామస్తులకు ఉపయోగపడే పనులు చేయించాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఉమేశ్, శ్రీరాములు, డీఈలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**వేగవంతంగా ఆస్పత్రి పనులు**

వికారాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారులు ఉన్నారు.

## స్పోర్ట్స్ కోటాలో పునర్నియామకం చేపట్టాలి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న స్పోర్ట్స్ కోటా పంచాయతీ కార్యదర్శులు

షాబాద్, ఫిబ్రవరి 28: స్పోర్ట్స్ కోటాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పునర్నియామకం చేపట్టాలని స్పోర్ట్స్ కోటా పంచాయతీ కార్యదర్శులు కోరారు. బుధవారం నగరంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2019 నుంచి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న సందర్భంగా రెండేళ్ల క్రితం స్పోర్ట్స్ కోటా కింద ఎంపిక కాని అభ్యర్థులు కోర్టులో కేసు వేశారన్నారు. కోర్టు కేసులో పంచాయతీ రాజ్ శాఖని మాత్రమే ప్రతివాదిగా చేర్చి, తమను ప్రతివాదులుగా చేర్చకుండా, మాకు ఎలాంటి సమాచారం లేకుండా కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కోర్టు ఉత్తర్వుల ద్వారా పంచాయతీరాజ్ శాఖ 2021 సెప్టెంబర్ 15న షోకాజ్ నోటీసుల ద్వారా విధుల నుంచి తొలగించారన్నారు. ప్రస్తుతం అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. మెరిట్‌లో ఉద్యోగం సాధించి అన్యాయానికి గురైన తమకు న్యాయం చేయాలని, 98 మంది పంచాయతీ కార్యదర్శుల భవిష్యత్‌ను కాపాడాలని కోరారు.

## పోలీస్ బులెటిన్ ఆవిష్కరణ



2023వ సంవత్సరం వార్షిక పోలీస్ బులెటిన్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి, పోలీసు అధికారులు

వికారాబాద్, ఫిబ్రవరి 28 : 2023 సంవత్సరంలో వికారాబాద్ జిల్లా పోలీస్ అధికారులు ఛేదించిన కేసులు, సాధించిన లక్ష్యాలు, అవేర్‌నెస్‌తో పాటు వారు చేసిన సేవలు తదితర కార్యక్రమాలతో రూపొందించిన వార్షిక పోలీస్ బులెటిన్‌ను బుధవారం ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏవో జోతిర్మయి, వర్టికల్ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజు, ఐటీసీటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, ఉమెన్ పీఎస్ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌ఐ అంజాద్ పాషా, ఏఎస్సై రాధిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**భూవివాదాల్లో పోలీసుల జోక్యం ఉండదు**

పరిగి టౌన్ : భూవివాదాలు, సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం ఉండదని కోర్టుల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని కేసులకు సంబంధించి కొంత మంది తమ స్వార్థం కోసం పోలీసులపై తప్పుడు ప్రచార కథనాలు రాస్తున్నారని తెలిపారు. వారిపై వారి యాజమాన్యానికి నోటీసులు అందజేసి పరువునష్టం దావా వేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బలపరీక్ష.. ఫలితం భద్రం

- హైకోర్టుకు చేరిన బాటసింగారం అవిశ్వాసం
- డీసీవో ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం
- చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన 9 మంది డైరెక్టర్లు
- ఫొటోలు, వీడియోలు తీసి సీల్డ్ కవర్‌లో న్యాయ స్థానానికి అందజేత
- మార్చి 7న తుది తీర్పు



బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాసానికి హాజరైన డైరెక్టర్లు, మద్దతుదారులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 28 : అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన వ్యవహారం హైకోర్టుకు చేరింది. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం అవిశ్వాస తీర్మానంపై బలపరీక్ష నిర్వహించినా.. ఫలితాన్ని వెల్లడించవద్దని, సమావేశంలో జరిగిన తీర్మానాలను సీల్డ్ కవర్ ద్వారా సమర్పించాలని డీసీవోను ఆదేశించింది. కాగా హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 11.30 గంటలకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో డీసీవో ధాత్రీదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మొత్తం 13 మంది డైరెక్టర్లకు అబ్దుల్లాపూర్‌మెట్ డైరెక్టర్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. మిగిలిన 12 మందిలో చైర్మన్‌పై అవిశ్వాసానికి హాజరయ్యారు. ముందుగా డైరెక్టర్లు సంతకాలు చేసినా.. మినిట్ బుక్, ఫొటోలు, వీడియోలను సీల్డ్ కవర్‌లో పొందుపర్చి డీసీవో హైకోర్టుకు అప్పగించారు. మార్చి 7న తుది నిర్ణయం వెలువడనున్నది. అంతకు ముందు 9 మంది డైరెక్టర్లు సంఘం వైస్ చైర్‌పర్సన్ నార్ల కొండ మల్లమ్మ, చేగూరి భరత్, చింతల లక్ష్మ మ్మ, మొగుళ్ల చిన్నయాదిరెడ్డి, బిజిలి బాలనర్సింహ, గంట శ్రీనివాస్‌రెడ్డి, ఇటికల మహేందర్‌రెడ్డి, కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మేకల రాములు వీరంతా నేరుగా సహకార సంఘం కార్యాలయానికి చేరుకున్నారు. చైర్మన్ విఠల్‌రెడ్డి, ఇద్దరు డైరెక్టర్లు పగిళ్ల బాల్‌రెడ్డి, కందాడి మహిపాల్‌రెడ్డి ప్రత్యేక సమావేశానికి హాజరు కాలేదు. సమావేశం అనంతరం డైరెక్టర్లను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ బింగి దాస్‌గౌడ్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని సన్మానించి అభినందనలు తెలిపారు.

**మార్చి 7న వెలువడనున్న ఫలితం**

బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌పై డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మార్చి 7న రాష్ట్ర అత్యున్నత న్యాస్థానం తీర్పు ఇవ్వనుంది. అవిశ్వాసానికి సంబంధించి బల పరీక్షను యథావిధిగా నిర్వహించాలని.. ఫలితాన్ని మాత్రం వెల్లడించవద్దని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో సహకార సంఘం అధికారులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి డైరెక్టర్లు చేసిన తీర్మానాన్ని గోప్యంగా ఉంచారు. అవిశ్వాసంపై చేసిన తీర్మానాల ఫొటోలు, వీడియోలను సీల్డ్ కవర్ ద్వారా న్యాయస్థానానికి సమర్పించారు.

**సహకార సంఘం వద్ద భారీ పోలీస్ బందోబస్తు**

బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌పై డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస బలపరీక్ష సందర్భంగా మండల కేంద్రంలోని సహకార బ్యాంక్ వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, సీఐ సైదయ్య ఆధ్వర్యంలో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వాసంస్వామి, ఎస్సైలు కరుణాకర్‌రెడ్డి, రమేశ్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పని మూరెడు.. ఖర్చు బారెడు

**బల్దియాలో డిప్యూటేషన్లకు ఎర్రతివాచీ**

### అడ్డు అదుపు లేకుండా వచ్చి చేరుతున్న డిప్యూటీ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు

### ఖజానాకు గుదిబండగా మారుతున్న వైనం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ఒకవైపు ఉద్యోగులకు నెలవారీగా వేతనాలు సకాలంలో అందని పరిస్థితి...పైగా నిధుల్లేక లేక అభివృద్ధి పనులు పట్టాలెక్కడం లేదు. పురోగతి పనులకు అతీగతి లేదు. కాంట్రాక్టర్లు సైతం బకాయి బిల్లులు చెల్లిస్తేనే పనులు చేపడతామంటూ నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. ఆశించిన స్థాయిలో ఆస్తిపన్ను వసూళ్లు లేవు. ఈ పరిస్థితిలో అధికార యంత్రాంగం లోపాలను సరిదిద్దుకుని పొదుపు మంత్రాలతో సంస్థను గట్టెక్కించాల్సి ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఇష్టారీతిన డిప్యూటేషన్లపై వస్తున్న అధికారులతో బల్దియా ఖజానాకు మరింత భారంగా మారుతున్నది. అసెంబ్లీ ఎన్నికల ముందు దాదాపుగా 15 మంది డిప్యూటేషన్‌పై డిప్యూటీ కలెక్టర్ల జీహెచ్‌ఎంసీకి వచ్చారు. ఎన్నికలు అయ్యాక ఒకరిద్దరికీ తప్ప.. మిగిలిన వారికి పెద్దగా పని లేదు. కొన్ని రోజులుగా వీరిని ఖాళీగా కూర్చోబెట్టి జీతాలు ఇచ్చిన యంత్రాంగం..ప్రధాన కార్యాలయంలో సర్దుబాటు చేశారు. అయితే ఇటీవల కాలంలో ఎన్నికల బదిలీల్లో భాగంగా పురపాలక శాఖకు సంబంధించిన దాదాపు 14కి పైగా మున్సిపల్ కమిషనర్లు డిప్యూటేషన్‌పై జీహెచ్‌ఎంసీకి వచ్చారు. వీరిని సర్దుబాటు చేసే క్రమంలో గతంలో ఎన్నడూ లేని విధంగా డిప్యూటీ కమిషనర్లుగా ఎస్‌డబ్ల్యూఎం బాధ్యతలు అప్పగించారు. ఇష్టారీతిన వస్తున్న డిప్యూటేషన్లతో ఖజానాకు భారమే తప్ప..వారి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఇటీవల కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటరులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థలో ఆర్థిక మాంద్యం ఉన్నప్పుడు అధికారులను తగ్గించాల్సింది పోయి వస్తున్న వారికి ఆహ్వానం పలుకుతున్నారని, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతో సహా ఎందరో ఉన్నా రావాల్సిన ఆదాయాన్ని రప్పించలేక, ఆపై అడ్డగోలు అక్రమాలు జరుగుతున్నా వాటిని అడ్డుకట్ట వేయలేకపోతున్నారని నిండు సభలో పార్టీలకు అతీతంగా ముక్తకంఠంతో లోపాలను ఎత్తి చూపారు. కమిషనర్ రోనాల్డ్ రాస్ అప్పటి వరకు కొనసాగిన అదనపు కమిషనర్ (అడ్మిన్) సరోజను బదిలీ వేటు వేశారు. అయితే డిప్యూటీ కలెక్టర్లు విషయంలో మాత్రం నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. కౌన్సిల్ సమావేశం జరిగిన తర్వాతే దాదాపు డజను మందికి పోస్టింగులిచ్చారు. పోనీ ఈ పోస్టింగులైన అధికారుల స్థాయికి తగ్గట్లు బాధ్యతలున్నాయా అంటే అదీలేదు. గతంలో ఒక్కరు చేసిన పనినే నలుగురైదుగురికీ అప్పగించారు. అంటే అదనంగా పెరిగింది అధికారులే కాదు.. వారికి అవసరమైన చాంబర్లు, కార్లు, సిబ్బంది వగైరా. దీంతో జీహెచ్‌ఎంసీకి ఖర్చుల భారం మరింత పెరుగుతుందే కానీ తగ్గదు. కేవలం తమ అవసరాల కోసం హైదరాబాద్ కు వచ్చేవారికి పునరావాస కేంద్రంగా జీహెచ్‌ఎంసీ మారుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నా పట్టించుకోవడం లేదు.

**అంతా గందరగోళం**

జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం ఏ శాఖకు ఏ అధికారి ఉన్నారో తెలుసుకోవాలంటే ఒకరకంగా కత్తిమీద సాములాంటిదే . గతంలో సంస్థలో వైద్యం, ఆరోగ్యం, పారిశుధ్యం, దోమల నివారణ, కుక్కల నియంత్రణ తదితరమైనవన్నీ ఒకే అడిషనల్ కమిషనర్ నిర్వహించే వారు. అది సైతం ఐఏఎస్ అధికారి కాదు. సహాయకులుగా ఒక జాయింట్ కమిషనర్ ఉండే వారు. ప్రస్తుతం ఆరోగ్యానికి ఒక అడిషనల్ కమిషనర్, పారిశుధ్యానికి మరో అడిషనల్ కమిషనర్, ఇందులో ఒకరు ఐఏఎస్ ..అడిషనల్ కమిషనర్లకు సహాయకంగా నలుగురైదుగురు జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు. వీరందరికీ కార్లతో సహా సకల సదుపాయాలు జీహెచ్‌ఎంసీ ఖజానా నుంచే అందనున్నాయి. ఇటీవల జీహెచ్‌ఎంసీకి బదిలీపై వచ్చిన ఇద్దరు డిప్యూటీ కమిషనర్లకు రెండు జోన్లలోని పారిశుధ్య పనులు అప్పగించారు. జోన్ల స్థాయిలో కేవలం ఈ పనులకు ప్రత్యేకంగా డిప్యూటీ కమిషనర్లను నియమించడం గతంలో లేదు. ఒక అడిషనల్ కమిషనర్‌కు గతంలో ఉన్న రెండు మూడు బాధ్యతలు తప్పించి కేవలం సంస్థాగత విచారణలు అనే విభాగాన్ని మిగిల్చారు. కొత్తగా బదిలీపై వచ్చిన మరో అడిషనల్ కమిషనర్‌కు పోస్టు కల్పించేందుకు ఉన్న బాధ్యతల్ని విడదీసి ఇలా అప్పగించారనే విమర్శలు లేకపోలేదు. మరో అడిషనల్ కమిషనర్ కు లీగల్, విద్యుత్ విభాగం బాధ్యతలు అప్పగించారు. ఇంకో స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌కు ఎన్నికల విభాగం జాయింట్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. రెవెన్యూ విభాగం నుంచి వచ్చిన డిప్యూటీ కలెక్టర్‌కు సైతం ఎన్నికల విభాగంలోనే మరో జాయింట్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇంకో స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌కు ఆరోగ్య విభాగంలో జాయింట్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కో విభాగంలో ఎంతమందిని నియమిస్తున్నారో అంతే లేదు. వెలుగులోకి రాని పోస్టింగ్‌లు మరెన్నో ఉన్నాయని అధికారుల్లో చర్చ జరుగుతున్నది.

**వివాదాస్పద డీసీలకు కీలక పోస్టులు**

ఇటీవల డిప్యూటీ కమిషనర్ల బదిలీలు జరిగాయి. ఇందులో ఇద్దరికీ కీలక పోస్టుల్లో బాధ్యతలు అప్పగించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అల్వాల్‌లో పనిచేసిన సమయంలో ఓ డీసీపై మహిళపై అసభ్యంగా ప్రవర్తించడం, మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసి.. సదరు డీసీని ప్రాధాన్యత లేని పోస్టులో నియమించాలని ఆదేశించింది. కానీ సదరు డీసీని హయత్‌నగర్ బాధ్యతలు అప్పగించారు. మరో డీసీ అవినీతి ఆఆరోపణలు ఉండగా, ప్రాధాన్యత లేని పోస్టులో ఉండాల్సినప్పటికీ సికింద్రాబాద్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ ఇద్దరి పోస్టుల వెనుక కాంగ్రెస్ పెద్దలు, ప్రొఫెసర్ ఉన్నట్లు చర్చ జరుగుతున్నది.




**భారమని తెలిసిన ఎందుకీ మౌనం?**

జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం ప్రతి నెలా వేతనాలు, పెన్షన్లకు రూ. 120-130 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. అయితే సంస్థలో అవసరాల మేరకు మాత్రమే డిప్యూటేషన్లకు ప్రోత్సహించాలి. కానీ అలా జరగడం లేదు. హైదరాబాద్‌లో ఉండాలనుకునే ఉద్యోగులంతా పైరవీతో కొందరు..కమిషనర్‌ను సంప్రదించి మరికొందరు వస్తున్నారు. కానీ ఇటీవల కాలంలో డిప్యూటేషన్లకు ఎర్ర తివాచీ పరిచారు. పోనీ వచ్చిన వారితో ఆశించిన స్థాయి ఫలితాలు శూన్యమనే చెప్పాలి. ఎందుకంటే జీహెచ్‌ఎంసీకి రావాల్సిన ఆదాయం రావడం లేదు. చెత్త సమస్యలు తగ్గడం లేవు. విద్యుత్ విభాగం నగరంలో చీకట్లను నివారించలేకపోతోంది. ప్రకటనల విభాగం అక్రమాలకు అడ్డాగా మారింది. రెవెన్యూ విభాగం ట్యాక్స్ ల్లోని లోపాలు అరికట్టలేకపోయింది. అంతేకాదు.. ఏ విభాగంలో చూసినా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఇటీవల అభయ హస్తం దరఖాస్తులు గాల్లో కొట్టుకు పోవడం అందుకు ఒక నిదర్శనం. కార్పొరేటర్లు ఫోన్లు చేసినా అధికారులు స్పందించరు.

## సైన్స్ ప్రదర్శనల్లో రంగారెడ్డి జిల్లా విద్యార్థుల ప్రతిభ



బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో నమూనాలు తయారు చేసిన రంగారెడ్డి జిల్లా విద్యార్థులు

షాబాద్, ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శనల్లో రంగారెడ్డి జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎగ్జిబిట్ కాంపిటీషన్‌లో జడ్పీహెచ్‌ఎస్ మీర్‌ఖాన్‌పేట్ విద్యార్థులు ప్రదర్శించిన లేజర్ అలర్ట్, సోలార్ గ్రాస్ కట్టర్ ఎగ్జిబిట్‌లకు మూడో బహుమతి వచ్చిందన్నారు. జడ్పీహెచ్‌ఎస్ ఇర్విన్, మాడుగుల పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని చెప్పారు. రాష్ట్రపతి నిలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బ్రహ్మారెడ్డి (జన విజ్ఞాన వేదిక), డాక్టర్ వీఆర్.శర్మ, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల సైన్స్ ఆఫీసర్లు హాజ రు కాగా, స్టాటప్ ఇండియా ప్రతినిధులు జడ్జిలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సై న్స్ ఎగ్జిబిట్ కాంపిటీషన్లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సాయి పూర్ణిమ, చరణ్‌తేజ, గైడ్ టీ చర్‌గా వ్యవహరించిన కె.అనిల్‌కుమార్‌లను జడ్పీహెచ్‌ఎస్ మీర్‌ఖాన్‌పేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. మిగతా విద్యార్థులు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని, రాబోయే రోజుల్లో మన పాఠశాలలకు మరిం త గుర్తింపు తేవాలని తెలిపారు. వీరందరికి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఇర్విన్ గైడ్ టీచర్ కరుణాకర్‌రెడ్డి, మాడ్గుల గైడ్ టీచర్ అమర్ తదితరులు పాల్గొన్నారు.

## కుళ్లిన పదార్థాలతో అల్లం, వెల్లుల్లి పేస్ట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విక్రయించేందుకు ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్న తయారీదారుడితో పాటు ముగ్గురిని సెంట్రల్ టాస్క్‌ఫోర్స్ జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిపెర్మాల్ కథనం ప్రకారం.. గుజరాత్‌కు చెందిన రహీమ్ ఛారనియ హైదరాబాద్‌కు జీవనోపాధి కోసం వచ్చి బేగంపేటలో ఉంటున్నాడు. డెక్కన్ ట్రేడర్స్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇందులో భాగంగా సులువుగా డబ్బు సంపాదించేందుకు రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లిలో అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. వివిధ రకాల రసాయనాల రంగులు, ఆమ్లాలను ఉపయోగించి నకిలీ అల్లం, వెల్లుల్లి పెస్ట్‌ను తయారు చేస్తున్నాడు. ఈ నకిలీ పేస్ట్‌ను కిరాణా, జనరల్ స్టోర్లు, వివిధ దుకాణాల ద్వారా హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా విక్రయిస్తున్నాడు. ఇందుకు బేగంపేటకు చెందిన పాండురంగారావు, బేగంబజార్‌కు చెందిన తెలంగాణ ఏజెన్సీ ప్రొప్రయిటర్ అజయ్ కుమార్ అహీర్, పంజాగుట్టకు చెందిన నిఖిల్ ట్రేడర్స్ ప్రొపరేటర్ ప్రదీప్ సంకాలలను డిస్ట్రిబ్యూటర్లుగా నియమించుకున్నాడు. ఇలా మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఈ నకిలీ అల్లం, వెల్లుల్లిని విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బేగంపేట పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి రహీం, పాండురంగారావు, అజయ్‌కుమార్, ప్రదీప్‌లను అరెస్ట్ చేశారు. రూ. 5 లక్షల విలువైన నకిలీ పేస్ట్‌ను, ముడి సరుకు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ అల్లం, వెల్లుల్లిలో ముగిగిపోయిన వస్తువులను కూడా వాడుతున్నట్లు వెల్లడైంది. 20 కిలోల కుళ్లిపోయిన అల్లం, వెల్లుల్లిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్